క్లుప్తంగా

నేడు జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం

పెనమలూరు: కానూరు 4వ సచివాలయం పరిధిలో సోమవారం జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం నిర్వహించనున్నామని తాడిగడప మున్సిపాలిటీ అసిస్టెంట్ కమిషనర్ కె.అభినేష్ తెలిపారు. కానూరులో సోమవారం 4వ సచివాలయంలో నిర్వహించనున్న వైద్య శిబిరాన్ని స్థానికులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఉచిత వైద్య పరీక్షలతో పాటు ఉచితంగా మందులు పంపిణీ చేస్తారన్నారు. కంటి పరీక్షలు చేసి ఉచితంగా కళ్లజోళ్లు ఇస్తారని తెలిపారు.

కంకిపాడు: మండలంలోని వేల్పూరు గ్రామంలో సోమవారం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ పీ అనూష తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి శిబిరం ప్రారంభమవుతుందన్నారు. స్పెషలిస్టు వైద్య నిపుణులు శిబిరంలో వైద్య సేవలు అందిస్తారన్నారు. గ్రామ ప్రజలు శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

వ్యక్తి పై దాడి

పెనమలూరు: తాడిగడపలో ఓ వ్యక్తిపై మరో వ్యక్తి దాడి చేయటంతో పోలీసులు ఆదివారం కేసు నమోదు చేశారు. తాడిగడప అంబేడ్కర్‌నగర్‌లో నాగిడి వెంకటనారాయణ కుటుంబ సభ్యులతో ఉంటున్నాడు. అతను కారు పేయింటర్‌గా పని చేస్తాడు. వెంకటనారాయణ వద్ద పని చేస్తున్న వర్కర్ల విషయమై అతని మేనమామ కిషోర్ తగాదాపడి దాడి చేశాడు. ఈ ఘటనపై బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేయటంతో కిషోర్‌పై కేసు నమోదు చేశారు.

రూ.13 లక్షలతో అంగన్‌వాడీ భవన నిర్మాణం



నున్న(విజయవాడరూరల్): నున్న గ్రామంలో నాడు-నేడు కార్యక్రమంలో అంగన్‌వాడీ కేంద్రం నిర్మాణ పనులు వేగంగా జరుగుతున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాలను ప్రీ స్కూల్‌గా మార్పు చేసి వాటికి నూతన భవనాలను నిర్మిస్తోంది. అందులో భాగంగా నున్న గ్రామం శాలివాహన బజారులో రూ.13 లక్షలతో భవనాన్ని నిర్మిస్తున్నారు. విద్యార్థులకు ఒక తరగతి గది, హాలు, నిత్యావసర వస్తువులను నిల్వ చేసేందుకు స్టోర్, వంటగది, ఉండేలా నిర్మాణం చేస్తున్నట్టు గ్రామ పంచాయతీ సర్పంచి కాటూరి సరళ, కార్యదర్శి జీటీవీ రమణ తెలిపారు.

నేడు మట్టి కలశాల ప్రదర్శన

ఉంగుటూరు: నా మట్టి-నా దేశం కార్యక్రమంలో భాగంగా 27 గ్రామాల నుంచి సేకరించిన మట్టి కలశాలను సోమవారం ఢిల్లీ పంపించేందుకు ఏర్పాట్లు సిద్ధం చేసినట్లు ఎంపీడీవో శేష గిరిరావు తెలిపారు. ఈ నేపథ్యంలో మండల పరిషత్ కార్యాలయం వద్ద నిర్వహించనున్న మట్టి కలశాల ప్రదర్శనలో ఎంపీటీసీలు, గ్రామ సర్పంచులు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

ఆఖరి మజిలీ అవస్థలకు చెక్



పోరంకి శ్మశానవాటిక



శ్మశానవాటికలో దహనవాటిక

- ప్రభుత్వం, దాతల సహకారంతో పోరంకి శ్మశానవాటిక అభివృద్ధి
- ఎమ్మెల్యే, ఎంపీ సహకారం
- మౌలిక సదుపాయాల కల్పన

పెనమలూరు: పోరంకి గ్రామంలో హిందూ శ్మశానవాటిక అభివృద్ధి పనులు చేపట్టారు. మనిషి అంతిమయాత్రలో జరిగే కార్యక్రమాల్లో ఎటువంటి అసౌకర్యం కలగకూడదని దాతలు, ప్రభుత్వ నిధులతో శ్మశానవాటిక అభివృద్ధి చేస్తున్నారు. పూర్వం గ్రామ పంచాయతీగా ఉన్న కాలంలో దివంగత వేదాంతం జోగాచార్యులు ముందు చూపుతో హిందూ శ్మశానవాటిక కోసం అత్యంత విలువైన ఎకరం పైగా స్థలం విరాళంగా ఇచ్చారు. పోరంకి గ్రామంలో మరణించిన వారికి ఇక్కడే దహన సంస్కరణలు చేసేవారు. అయితే శ్మశానవాటికలో కనీస వసతులు లేక పోవటంతో సమస్యలు తలెత్తి గ్రామస్తులకు ఇబ్బందులు తప్పడం లేదు. దీంతో గ్రామంలో వైఎస్సార్ సీపీ నేత ముప్పాళ్ల వెంకటేశ్వరరావు ముందుకు వచ్చి పోరంకి హిందూ శ్మశానవాటిక అభివృద్ధికి నడుంబిగించారు. దీనికి ఎమ్మెల్యే కొలుసు పార్థసారథి, ఎంపీ వల్లభనేని బాలశౌరి, దాతలు, గ్రామస్తులు పూర్తిగా సహకరించారు.

రూ.38 లక్షల ప్రభుత్వ నిధులతో..

శ్మశానవాటిక ప్రహరీ లేక పోవటంతో గతంలో ఈ ప్రాంతంలో కొందరు వ్యక్తులు అసాంఘిక కార్యక్రమాలు నిర్వహించే వారు. ఎంపీ బాలశౌరి రూ.10 లక్షలు, ఎమ్మెల్యే పార్థసారథి సహకారంతో మండలం, పంచాయతీ నిధులు రూ.28 లక్షలతో శ్మశానవాటికకు ఉత్తరం, దక్షిణం, పడమర వైపు ప్రహరీ నిర్మాణం చేశారు. రూ.5 లక్షలు పంచాయతీ నిధులతో అంతర్గత రోడ్లు వేశారు.

దాతల సహకారంతో..

దాత తోటకూర కిషన్ రూ.3 లక్షల విరాళంతో కర్మకాండ భవనం నిర్మించారు. మార్కండేయ చారిటబుల్ ట్రస్టు సహకారంతో నిలువెత్తు శివుడి విగ్రహం ఏర్పాటు చేశారు. ఏబీసీ బుచ్చయ్య చౌదరి, ముప్పాళ్ల సుబ్బారావు కుటుంబ సభ్యులతో పాటు, దాతలు పంచమర్తి ప్రసాదరావు, కె.రామిరెడ్డి, రామినేని శివాజీ, పలువురు దాతల సాయంతో చిమ్నీలు, ఓపెన్‌చిమ్నీలు, దింపుడు కల్లం, షెడ్లు, స్నానాలకు ఏర్పాట్లు చేశారు. ఇప్పటివరకు రూ.అర కోటికి పైగా నిధులు ఖర్చు చేశారు. శ్మశానవాటికలో వసతులు ఏర్పడటంతో ప్రస్తుతం ఇబ్బందులు తొలిగాయి.

దాతలు సహకరిస్తే మరిన్ని సౌకర్యాలు..



అందరి సహకారంతో శ్మశానవాటికను అభివృద్ధి చేశాం. దాతలు సహకరిస్తే మరిన్ని సౌకర్యాలు కలిప్తాము. రాజకీయాలకు అతీతంగా అందరి సహకారంతో శ్మశానవాటికను మరింత అభివృద్ధి చేయటం కమిటీ బాధ్యత.

–ముప్పాళ్ల వెంకటేశ్వరరావు, హిందూ శ్మశానవాటికి అభివృద్ధి కమిటీ

కానూరులో ఘనంగా నిమజ్జనోత్సవం

ప్రత్యేక పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యే పార్థసారథి



కానూరు సిరినగర్‌లో వినాయకుడి విగ్రహం



పూజలు చేస్తున్న ఎమ్మెల్యే పార్థసారథి

పెనమలూరు: కానూరు సిరినగర్‌లో వినాయకుడి విగ్రహ నిమజ్జనోత్సవం ఆదివారం ఘనంగా నిర్వహించారు. సిరినగర్‌లో 13 సంవత్సరాలుగా వినాయక చవితి సందర్భంగా ఉత్సవాలు నిర్వహిస్తున్నారు. వేమూరి సురేష్ ఫ్రెండ్ సర్కిల్, భక్త బృందం 21 రోజులుగా వినాయక ఉత్సవాలు చేశారు. భక్తుల కోసం శనివారం అన్నసమారాధన నిర్వహించారు. వినాయక విగ్రహం నిమజ్జనం సందర్భంగా ఆదివారం ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కొలుసు పార్థసారథి ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. అనంతరం వినాయకుడి విగ్రహాన్ని ప్రత్యేకంగా అలంకరించిన వాహనంపై గ్రామంలో ఊరేగించారు. ఈ సందర్భంగా పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. భక్తులు నిమజ్జన కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

మంతెనలో చురుగ్గా అభివృద్ధి పనులు

రూ.20 లక్షలతో డ్రెయినేజీ, రోడ్ల నిర్మాణం



నిర్మాణం పూర్తయిన సిమెంటు డ్రెయిన్

కంకిపాడు: గడప గడపకు మన ప్రభుత్వం నిధులతో మంతెన గ్రామ అభివృద్ధి పనులు చురుగ్గా సాగుతున్నాయి. మంతెన సచివాలయం పరిధిలోని మంతెన, జగన్నాథపురం గ్రామాలు ఉన్నాయి. ఎమ్మెల్యే కొలుసు పార్థసారథి ఆయా గ్రామాల్లో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పర్యటించి ప్రజా సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఆయా శాఖల అధికారులతో సమీక్షలు జరిపి కార్యాచరణ ప్రణాళికకు ఆదేశించారు.

రూ.20 లక్షల నిధులతో పనులు..

గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం పూర్తయిన మంతెన గ్రామానికి రూ.20 లక్షలు నిధులు కేటాయించారు. ఈ నిధులతో బోసు బొమ్మ సెంటరులో ప్రధాన డ్రెయినేజీ నిర్మాణం పూర్తి చేశారు. రెండు అంతర్గత రహదారులను మెటల్, రబ్బిష్ రోడ్డుగా అభివృద్ధి చేశారు. తొలి లేయరు పనులు ఇప్పటికే పూర్తికాగా, తుదిదశ పనుల నిర్వహణకు అధికారులు చర్యలు చేపడుతున్నారు. జగన్నాథపురం గ్రామంలో డ్రెయినేజీ నిర్మాణ పనులు చేపట్టేందుకు సన్నాహాలు చేస్తున్నారు.

సమర్థంగా అభివృద్ధి పనులు



గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ప్రజల నుంచి వచ్చిన విజ్ఞప్తులను దృష్టిలో ఉంచుకుని వాటిని పరిష్కరించేందుకు చర్యలు తీసుకున్నాం. నిధులను ప్రభుత్వం కేటాయించింది. పనులు సమర్థంగా సాగుతున్నాయి. త్వరితగతిన పనులు పూర్తి చేసేలా చర్యలు చేపడుతున్నాం.

–వీరంకి వెంకట రమణ, సర్పంచ్, మంతెన

రోడ్డు నిర్మాణ పనుల పరిశీలన



రోడ్డు అభివృద్ధి పనులు పరిశీలిస్తున్న ఎంపీపీ, మాజీ వైస్ ఎంపీపీ

గన్నవరం: స్థానిక శ్రీమల్లికార్జున హైస్కూల్ నుంచి రాజీవ్ నగర్ కాలనీ వరకు ప్రధాన రహదారి అభివృద్ధి పనులు వేగంగా జరుగుతున్నాయి. మండల పరిషత్, బుద్దవరం గ్రామ పంచాయతీ సంయుక్త నిధులు రూ.32 లక్షలతో సీసీ రోడ్డు నిర్మాణం చేపట్టారు. మొత్తం 350 మీటర్లు పొడవు, 4.5 మీటర్లు వెడల్పున రహదారి నిర్మిస్తున్నారు. గన్నవరం నుంచి రాజీవ్‌నగర్ కాలనీకి వెళ్లే బీటీ రోడ్డు పూర్తిగా దెబ్బతినడంతో రాకపోకలకు ఇబ్బందిగా మారింది. ప్రజల విజ్ఞప్తిపై స్పందించిన ఎమ్మెల్యే డాక్టర్ వల్లభనేని వంశీమోహన్ ఇటీవల శంకుస్థాపన చేశారు. వర్షాలు తగ్గుముఖం పట్టడంతో పది రోజుల క్రితం రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభించారు. రహదారిని కొంత మేర మెరక చేసిన తర్వాత సీసీ రోడ్డు నిర్మాణం చేపట్టారు. ఈ రహదారికి అనుసంధానంగా మరో రూ.8 లక్షలతో సీసీ రోడ్డును కూడా నిర్మాణం చేస్తున్నారు. ఈ రోడ్ల నిర్మాణం పూర్తికావస్తుండడంతో ఈ ప్రాంత ప్రజల కష్టాలు తీరనున్నాయి.

వంతెన నిర్మాణం పూర్తి చేయండి



నిరసన వ్యక్తం చేస్తున్న సీపీఎం నేతలు

పెనమలూరు: యనమలకుదురు వంతెన పనులు పూర్తి చేయాలని కోరుతూ సీపీఎం ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేశారు. గ్రామంలో ఆదివారం జరిగిన కార్యక్రమంలో సీపీఎం నాయకుడు షేక్ కాశిం మాట్లాడుతూ గత పది సంవత్సరాలుగా యనమలకుదురు వంతెన పనులు పూర్తి చేయలేదన్నారు. వంతెన లేకపోవటంతో గ్రామంలో నిత్యం ట్రాఫిక్ సమస్య తలెత్తుతుందన్నారు. ప్రధానంగా మహాశివరాత్రి పండుగ సందర్భంగా గ్రామంలో శివరాత్రి మహోత్సవాలలో పాల్గొనే భక్తులు చాలా బ్బందులు పడుతున్నారన్నారు. అసంపూర్తిగా ఉన్న యనమలకుదురు వంతెన నిర్మాణం పూర్తి చేయమాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నేతలు ఉప్పాడ త్రిమూర్తి, షేక ఇబ్రహీం, పిల్లా వసంతరావు, వాటపల్లి శ్రీరాములు, గ్రామస్తులు పాల్గొన్నారు.

19 టన్నుల రేషన్ బియ్యం పట్టివేత



పెనమలూరు: కానూరులో అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని రెవెన్యూ అధికారులు ఆదివారం పట్టుకున్నారు. తహసీల్దార్ కట్టా వెంకటశివయ్య తెలిపిన వివరాల ప్రకారం.. కానూరు కొత్త ఆటోనగర్‌లో 19 టన్నుల రేషన్ బియ్యాన్ని లారీలో అక్రమంగా తరలిస్తున్నారన్న సమాచారంతో రెవెన్యూ, సివిల్ సప్లయీస్ అధికారులు దాడులు చేసి లారీని పట్టుకున్నారు. లారీలో 19 టన్నుల రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. అక్రమంగా రేషన్ బియ్యం తరలిస్తున్న వారిపై క్రిమినల్ కేసు నమోదు చేస్తామని తహసీల్దార్ వెంకటశివయ్య తెలిపారు.

రౌడీషీటర్లకు కౌన్సెలింగ్



పటమట(విజయవాడతూర్పు): అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడినా.. ఘర్షణలు, గంజాయి వంటి సంఘ వ్యతిరేక పనుల్లో చేపట్టినా ఉపేక్షించేదిలేదని రౌడీషీటర్లను పటమట సీఐ కాశీవిశ్వనాథ్ హెచ్చరించారు. ఆదివారం పటమట పోలీస్‌స్టేషన్ పరిధిలోని రౌడీషీటర్లకు ఆయన కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ.. స్టేషన్ పరిధిలోని రౌడీషీటర్లందరూ తప్పనిసరిగా ప్రతి ఆదివారం కౌన్సెలింగ్‌కు హాజరు కావాలన్నారు. వివిధ కారణాలతో గైర్హాజరై, దందాలు చేస్తే సహించేంది లేదని చర్యలు తప్పవన్నారు. నగర బహిష్కరణ గురవుతారని, నేర ప్రవర్తన మార్చుకోవాలని సూచించారు.

గ్రంథాలయానికి పుస్తకాల వితరణ



పుస్తకాలు స్వీకరించిన విద్యార్థులతో జెడ్పీటీసీ ఎలిజబెత్ రాణి, సిబ్బంది

గన్నవరం రూరల్: విజ్ఞాన సాధనకు పుస్తక పఠనం ఒక్కటే మార్గమని జెడ్పీటీసీ సభ్యురాలు అన్నవరపు ఎలిజబెత్ రాణి అన్నారు. ఆదివారం మండలంలోని పురుషోత్తపట్నం శాఖా గ్రంథాలయానికి నీతి కథలు, స్టోరీ పుస్తకాలను అందజేశారు. ఈ సందర్భంగా లైబ్రేరియన్ కె.కృపానందం అధ్యక్షతన జరిగిన సభలో ఆమె మాట్లాడుతూ గ్రంథాలయాల అభివృద్ధికి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎంతో కృషి చేశారని చెప్పారు. వేసవి శిక్షణా శిబిరాలు ఏర్పాటు చేయటం ద్వారా విద్యార్థులలోని సృజనను వెలికితీయడంతో పాటు, పుస్తక పఠనం పట్ల విద్యార్థుల్లో ఆసక్తిని పెంచారన్నారు. గ్రామస్తులు పార్థసారథి, వెంకట్రామయ్య, సుబ్బారావు, సీతారామయ్య, నాగభూషణం, కోటేశ్వరరావు, చిన్న, లోకేశ్వరరావు, సత్యం, ప్రభుదాస్ పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు సత్కారం



ఉపాధ్యాయులను సన్మానిస్తున్న సంఘ ప్రతినిధులు

పెనమలూరు: అంతర్జాతీయ ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా పలువురు ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. ఆంధ్రప్రదేశ్ అన్ ఎయిడెడ్ ప్రైవేట్ స్కూల్స్ అసోసియేషన్స్ (ఏపీపీయూఎస్ఎంఏ) ఆధ్వర్యంలో ఆదివారం తాడిగడపలో జరిగిన కార్యక్రమంలో జిల్లా స్థాయిలో ఉత్తమ సేవలు అందించిన దాదాపు 20 మంది ఉపాధ్యాయులను సంఘం ప్రత్యేకంగా సన్మానించింది. పెనమలూరుకు చెందిన వికాసన్ పాఠశాల ఉపాధ్యాయుడు పెండ్యాల రాజేష్, జ్యోతి కాన్వెంట్ ప్రిన్సిపాల్ రాజులపాటి ఆదిశేషులను కమిటీ ఘనంగా సన్మానం చేశారు. సమాజంలో ఉపాధ్యాయులు పాత్రచాలా కీలకమని కమిటీ సభ్యులు తెలిపారు. ఈ కార్యక్రమంలో సంఘ ప్రతినిధులు కె.సాంబశివరావు, నరేంద్రకుమార్, వై.విజయ్‌కుమార్, ఆర్ఎస్ఎన్ ప్రసాద్, కేఆర్ఎస్.రావు, చిగురుపాటి వివేకానంద పలువురు పాల్గొన్నారు.

వేధింపులపై కేసు

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): అదనపు కట్నం తీసుకురావాలని వివాహితను వేధింపులకు గురి చేయడంపై కొత్తపేట పోలీసులు ఆదివారం కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం పాతరాజరాజేశ్వరిపేటకు చెందిన నూకతోటి మల్లేశ్వరికి గతేడాది నవంబర్‌లో పెజ్జోనిపేటకు చెందిన రామారావుకు ఇచ్చి పెద్దలు వివాహం జరిపించారు. వివాహ కట్నం కానుకలను అందించగా, కొంత కాలంగా రామారావు భార్యను పుట్టింటికి వెళ్లి డబ్బులు తీసుకురావాలని వేధించసాగాడు. దీంతో బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారు.

అత్తింటి వేధింపులపై ఫిర్యాదులు

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): అత్తింటి వేధింపులపై కొత్తపేట పోలీస్ స్టేషన్ పరిధిలో అందిన ఫిర్యాదుల మేరకు ఆదివారం పోలీసులు కేసులు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం టీనర్‌పేట గండమాల అచ్చమ్మ వీధికి చెందిన పోతిన నందినిని ఏడాది కిందట అప్పారావుపేటకు చెందిన పోతిన దుర్గాప్రసాద్‌కు ఇచ్చి పెద్దలు వివాహం జరిపించారు. వివాహ సమయంలో రూ.5 లక్షలు కట్నం, ఇతర లాంఛనాలు ఇచ్చారు. పెళ్లయినప్పటి నుంచి నందినికి అత్తింటి వేధింపులు ఎక్కువయ్యాయి. నందిని ఆడపడుచు నాగలక్ష్మి, దుర్గాప్రసాద్ మేనత్త లక్ష్మిలు శారీరకంగా వేధింపులకు గురి చేయడంతో బాధితురాలు పుట్టింటికి చేరింది. అత్తింటి వేధింపులపై పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారు.

పరిశుభ్రతకు కృషి



రోడ్డును శుభ్రం చేస్తున్న లయన్స్ ప్రతినిధులు

ఉయ్యూరు: స్వచ్ఛ సేవతో పరిసరాల పరిశుభ్రతకు కృషి చేస్తున్నామని లయన్స్ డిస్ట్రిక్ట్ ట్రెజరర్ నూకల వెంకట సాంబశివరావు అన్నారు. లయన్స్‌క్లబ్ ఆఫ్ ఉయ్యూరు ఆధ్వర్యంలో స్వచ్ఛ భారత్, స్వచ్ఛ సేవ కార్యక్రమం ఆదివారం ఉయ్యూరు పట్టణంలో నిర్వహించారు. పారిశుద్ధ్య కార్మికులతో కలిసి వీధులను ఊడ్చి పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. విద్యార్థులతో కలిసి ప్రదర్శన చేశారు. సాంబశివరావు మాట్లాడుతూ ప్రజారోగ్య పరిరక్షణకు లయన్స్‌క్లబ్ కృషి చేస్తుందన్నారు. ప్రజలు స్వచ్ఛసేవలో భాగస్వాములై పరిసరాల పరిశుభ్రతకు ప్రాధాన్యం ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షుడు ఎండి ఇస్మాయిల్, ప్రతినిధులు నల్లా శ్రీనివాస్, ఊర కిషోర్, డాక్టర్ రావులపల్లి సుధాకర్, సిహెచ్ కుటుంబ రాజు, ఎంకే బాబు, తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ సానుకూల దృక్పథంతో ఉండాలి

హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ మన్మథరావు



విజేతకు బహుమతి అందజేస్తున్న జస్టిస్ మన్మథరావు, డాక్టర్ ఎంజే నాయుడు, మాధవి

లబ్బీపేట(విజయవాడతూర్పు): జీవితంలో ఎన్ని కష్టాలు ఎదురైనా ఎప్పుడూ సానుకూల దృక్పథంతో ఉండాలని హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ మన్మథరావు అన్నారు. నగరంలో ఆదివారం జరిగిన ఎంజే నాయుడు హాస్పిటల్ 37వ వార్షికోత్సవంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. మెగా వైద్య శిబిరాన్ని ఆయన జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. జస్టిస్ మన్మథరావు మాట్లాడుతూ మనిషిలో సానుకూలతత్వం అనేది ఆరోగ్యాన్ని సైతం మెరుగుపరుస్తుందన్నారు. ఆరోగ్యమే మహాభాగ్యమని, ప్రతి ఒక్కరూ ఆరోగ్యకర జీవన విధానాన్ని అలవర్చుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా ఇటీవల బాలల్లో ఊబకాయం అంశంపై నిర్వహించిన చిత్రలేఖనం, వక్తృత్వ, పోస్టర్ ప్రజెంటేషన్ పోటీల్లో విజేతలకు ఆయన నగదు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన మెగా వైద్య శిబిరానికి అనూహ్య స్పందన లభించింది. డాక్టర్ ఎంజే నాయుడు పలువురికి వైద్య పరీక్షలు చేసి, వారి సందేహాలను నివృత్తి చేశారు. ఆస్పత్రి మేనేజింగ్ డైరెక్టర్ మాధవీ నాయుడు, డాక్టర్ వంశీకృష్ణ, డాక్టర్ రవితేజ, ఆస్పత్రి ఫౌండేషన్ చైర్మన్ వావిలాల రజనీకాంత్‌శర్మ పాల్గొన్నారు.

సందేశాత్మకంగా సాగిన నాటక ప్రదర్శన

విజయవాడకల్చరల్: ఆంధ్రా ఆర్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో నెల వారీ కార్యక్రమంలో భాగంగా గాంధీనగర్ వెలిదండ్ల హనుమంతరాయ గ్రంథాలయంలో ఆదివారం ప్రదర్శించిన భూగోళం నాటకం సందేశాత్మకంగా సాగింది. నేటి ఆధునిక సమాజంలో మానవ సంబంధాలు మాయం అవుతున్నాయని ఆర్థిక సంబంధాలు కుటుంబ వ్యవస్థను పట్టించుకోవడం లేని మానవ సంబంధాలు కాపాడుకోవాలనే సందేశంతో నాటిక సాగుతుంది. రచన మెదలి సంజీవి, దర్శకత్వం వేంపాటి రమేష్, బాయన శ్రీనివాసరావు, వేంపాటి రమేష్, బొర్రా నారాయణ, రాధ, రాజేశ్వరి నటించారు. కార్యక్రమాలను ప్రారంభించిన గ్రంథాలయం అధ్యక్షుడు దోకిపర్తి శంకరరావు మాట్లాడారు.